ఓటే వజ్రాయుధం

● ఘనంగా జాతీయ ఓటరు దినోత్సవం
● సీనియర్ సిటిజన్లకు సన్మానం



ఆత్మకూరు: ప్రతిజ్ఞ చేస్తున్న రెవెన్యూ సిబ్బంది

ఆత్మకూరు: ఓటే వజ్రాయుధమని పలువురు పేర్కొన్నారు. జాతీయ ఓటరు దినోత్సవాన్ని శ్రీశైలం, నందికొట్కూరు నియోజకవర్గాల్లో శనివారం ఘనంగా నిర్వహించారు. విద్యార్థులతో కలిసి అధికారులు ర్యాలీలు నిర్వహించారు. ఓటు విలువపై ప్రజలకు అవగాహన కల్పించారు. ఆత్మకూరు తహసీల్దార్ కార్యాలయంలో డిప్యూటీ తహసీల్దార్ శ్రీనివాసులు మాట్లాడుతూ ఓటు హక్కును మంచి పాలకులను ఎన్నుకునేందుకు ఉపయోగించాలని సూచించారు. అనంతరం సీనియర్ సిటిజన్లు అచ్చయ్య, ముర్తుజాలను మున్సిపల్ కమిషనర్ రమేష్‌బాబు, సబ్‌ట్రెజరీ ఇన్‌చార్జ్ ఆఫీసర్ సాహిద్ సన్మానించారు. ముగ్గుల పోటీల్లో గెలుపొందిన మహిళలకు బహుమతుల ప్రదానం చేశారు.

● **శ్రీశైలంప్రాజెక్ట్:** సున్నిపెంటలోని తహసీల్దార్ కార్యాలయం వద్ద శనివారం జాతీయ ఓటరు దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. తహసీల్దార్ కె.వి.శ్రీనివాసులు మాట్లాడుతూ ప్రజాస్వామ్యాన్ని కాపాడడంలో ఓటు ఆయుధంగా పనిచేస్తుందన్నారు. ప్రతి ఒక్కరూ ఓటు హక్కును వినియోగించుకుని, సుపరిపాలన అందజేసే ప్రజాప్రతినిధులను ఎన్నుకోవాలని సూచించారు. డిగ్రీ కళాశాలలో విద్యార్థులచే ఓటు హక్కు ప్రాధాన్యతపై ప్రిన్సిపాల్ డాక్టర్.పి.హుస్సేన్ బాషా ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దార్ శ్రీనివాసులు పాల్గొన్నారు.

● **జూపాడుబంగ్లా:** పద్దెనిమిదేళ్లు నిండిన ప్రతి ఒక్కరూ ఓటరుగా నమోదు చేయించుకోవాలని తహసీల్దార్ చంద్రశేఖర్‌నాయక్, రీసర్వే డీటీ నాగన్న సూచించారు. శనివారం జాతీయ ఓటరు దినోత్సవాన్ని పురస్కరించుకొని తాటిపాడు, తంగడంచ, మండ్లెం, 80బన్నూరు, తరిగోపుల, పారుమంచాల, తూడిచెర్ల, తర్తూరు తదితర గ్రామాల్లో జాతీయ ఓటరు దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఓటుహక్కును సద్వినియోగం చేసుకోవాలని, ఓటరుగా నమోదు చేయించుకోవాలనే నినాదాలతో విద్యార్థులు, సచివాలయ ఉద్యోగులు గ్రామాల్లో ర్యాలీలు నిర్వహించారు. మహిళలకు ముగ్గుల పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేశారు.

● **మిడుతూరు:** స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, ఆదర్శ పాఠశాలలో ఓటరు దినోత్సవ వేడుకలు రెవిన్యూ సిబ్బంది ఆధ్వర్యంలో నిర్వహించారు. విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో వీఆర్వో వెంకటయ్య పాల్గొన్నారు.

● **పగిడ్యాల:** జాతీయ ఓటరు దినోత్సవాన్ని ఎంపీడీఓ సుమిత్రమ్మ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. పలు పోలింగ్ కేంద్రాల వద్ద నూతనంగా ఓటరు నమోదుకు యువతతో దరఖాస్తులు స్వీకరించారు. కార్యక్రమంలో ఎంఈఓ -2 మురళీమోహన్‌రెడ్డి, ఈఓఆర్డీ నాగేంద్రయ్య, రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ శ్రీరంగారెడ్డి పాల్గొన్నారు.

● **కొత్తపల్లి:** జాతీయ ఓటర్ల దినోత్సవం సందర్భంగా తహసీల్దార్ కార్యాలయం ఎదుట వీఆర్వోలతో కలిసి డిప్యూటీ తహసీల్దార్ పెద్దన్న ప్రతిజ్ఞ చేయించారు. పద్దెనిమిదేళ్లు నిండిన యువత ఓటరుగా పేరు నమోదు చేసుకోవాలని సూచించారు.

● **పాములపాడు:** మండలంలో జాతీయ ఓటరు దినోత్సవం నిర్వహించారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయం వద్ద సిబ్బందిచే ప్రతిజ్ఞ చేయించారు. సీనియర్ సిటిజన్లను సన్మానించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ సుభద్రమ్మ మాట్లాడుతూ ఓటుతో ప్రజా ప్రతినిధులను ఎన్నుకునే హక్కు ఉందన్నారు. కార్యక్రమంలో రీ సర్వే డిప్యూటీ తహసీల్దార్ సుప్రియ పాల్గొన్నారు.


పాములపాడు: సీనియర్ సిటిజన్‌ను సన్మానిస్తున్న రీ సర్వే డిప్యూటీ తహసీల్దార్ సుప్రియ


తంగడంచలో..


నెహ్రూనగర్ పోలింగ్ కేంద్రం వద్ద దరఖాస్తు స్వీకరిస్తున్న బూత్‌స్థాయి అధికారులు

క్లుప్తంగా

మహానందిలో వీకెండ్ సందడి


కామేశ్వరీదేవి దర్శనం చేసుకుంటున్న భక్తులు

మహానంది: వీకెండ్ కావడంతో శనివారం మహానంది ఆలయం భక్తులతో కళకళలాడింది. రెండు తెలుగు రాష్ట్రాలతో పాటు పలు ప్రాంతాలకు చెందిన భక్తులు ఆలయానికి చేరుకుని కోనేరుల్లో పుణ్యస్నానాలు ఆచరించి కామేశ్వరీదేవి, మహానందీశ్వరస్వామి వార్లతో పాటు కోదండ రామాలయం, వినాయకనంది, గరుడనంది ఆలయాలను సందర్శించి భక్తి శ్రద్ధలతో పూజలు చేపట్టారు. వేదపండితులు బ్రహ్మశ్రీ చెండూరి రవిశంకర అవధాని, నాగేశ్వరశర్మ, ఆంజనేయశర్మ, హనుమంతుశర్మలు స్వామి, అమ్మవారి ఉత్సవమూర్తులను విశేషంగా అలంకరించి రాత్రి ఏకాంత సేవ పూజలు నిర్వహించారు.

అధిక ధరలకు విక్రయిస్తే లైసెన్స్ రద్దు చేస్తాం


ఎరువులను తనిఖీ చేస్తున్న ఏడీఏ ఆంజనేయులు, సిబ్బంది

ఆత్మకూరు: ఎరువులను అధిక ధరలకు ఎరువులను విక్రయిస్తే లైసెన్సులు రద్దు చేస్తామని ఏడీఏ ఆంజనేయులు, ఏఓ విష్ణువర్ధన్‌రెడ్డి దుకాణదారులను హెచ్చరించారు. శనివారం వారు పట్టణంలోని జీఎంఆర్, ఆగ్రో, మధు ట్రేడర్స్, వసుంధర ఫర్టిలైజర్ అండ్ కెమికల్స్‌ను తనిఖీ చేశారు. నిబంధనల మేరకు విక్రయాలు జరపాలని సూచించారు.

మిడుతూరు-2 సచివాలయం తనిఖీ


సచివాలయం తనిఖీ చేస్తున్న ఎంపీడీఓ దశరథరామయ్య

మిడుతూరు: మండల పరిధిలోని పీరుసాహెబ్ పేట గ్రామంలో ఉన్న మిడుతూరు -2 సచివాలయాన్ని ఎంపీడీఓ దశరథరామయ్య శనివారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ మాట్లాడుతూ సచివాలయ ఉద్యోగులు బాధ్యతాయుతంగా పనిచేయాలని, సర్వేలు పకడ్బందీగా చేపట్టాలని సూచించారు. ఆయన వెంట ఈఓఆర్డీ సంజన్న ఉన్నారు.

బాలసుందరం సేవలు మరువలేనివి


బాలసుందరం చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న దృశ్యం

ఆత్మకూరు: దళితుల కోసం బాలసుందరం చేసిన సేవలు మరువలేనివని ఆత్మకూరు మాలమహానాడు రాష్ట్ర నాయకులు మల్లే ఎలీషా, ఏపీఎస్ఆర్‌టీసీ ఎస్సీ సెల్ నాయకులు నాగేంద్ర, వెంకటేశ్వర్లు, శేషు పేర్కొన్నారు. పట్టణంలోని అంబేడ్కర్ స్ఫూర్తి కేంద్రంలో శనివారం బాలసుందరం సంతాప సభ ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ బడుగు, బలహీనవర్గాల సమస్యలపై బాలసుందరం పోరాడారన్నారు. కార్యక్రమంలో మాల మహానాడు నాయకులు మల్లయ్య, వెంకటేశ్వర్లు, రమణ, రాఘవేంద్ర, చంద్రశేఖర్, చెన్నయ్య, ఎమ్మార్పీఎస్ నాయకులు రాజు పాల్గొన్నారు.

తగ్గిన శనగ పంట దిగుబడి


దిగుబడిని తూకం వేస్తున్న అధికారులు

జూపాడుబంగ్లా: మండలంలోని మండ్లెం గ్రామ రెవెన్యూ పరిధిలో రైతు మాలిక్ సాగు చేసిన శనగపంటలో జిల్లా ఉపగణాంకాధికారి కె.రామాంజనేయులు, జూపాడుబంగ్లా ఏఎస్ఓ హనుమంతు శనివారం పంటకోత ప్రయోగం నిర్వహించారు. 55 చదరపు మీటర్లలో పంటను తీసి నూర్పిడి చేయగా 5.110 కిలోలు మాత్రమే దిగుబడి వచ్చినట్లు పేర్కొన్నారు. వర్షాభావ పరిస్థితులు నెలకొనడంతో శనగపంటలో దిగుబడి లోపించినట్లు అధికారులు అంచనాకు వచ్చారు.

ఫీల్డ్ అసిస్టెంట్ల రాజీనామా

శిరివెళ్ల: మండలంలో ఏడుగురు ఫీల్డ్ అసిస్టెంట్లు రాజీనామా చేశారని ఎంపీడీఓ శివమల్లేశ్వరప్ప శనివారం తెలిపారు. గంగవరం, బోయలకుంట్ల, చెన్నూరు, గోవిందపల్లె, కోటపాడు, గుంప్రమాన్‌దిన్నె, యర్రగుంట్ల గ్రామాల ఫీల్డ్ అసిస్టెంట్లు స్వచ్ఛందంగా రాజీనామా చేశారన్నారు. ప్రస్తుతం ఉపాధి పథకం సామాజిక తనిఖీ జరుగుతుందని, ఈనెల 30న ప్రజా వేదిక చర్చ ఉంటుందని తెలిపారు.

ఇంటింటా లెప్రసీ సర్వే

ఆత్మకూరు: పట్టణంలో శనివారం లెప్రసీ సర్వేను ఇంటింటా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆత్మకూరు ప్రభుత్వ వైద్యశాల వైద్యాధికారిణి తేజస్విని, డిప్యూటీ పారామెడికల్ ఆఫీసర్ రమణ, డాక్టర్లు గోపాల్‌రెడ్డి, సాదియాల ఆధ్వర్యంలో ప్రతి ఇంటి వద్దకు వెళ్లి కుటుంబ సభ్యులతో మాట్లాడారు. ఎరుపు, తెల్ల రంగు, స్పర్శ లేని మచ్చల వివరాలను నమోదు చేసుకున్నారు. కార్యక్రమంలో సీనియర్ టీబీ సూపర్‌వైజర్ పెద్ద మస్తానయ్య పాల్గొన్నారు.

మహానంది ఈఓను కలిసిన డీవీఎంసీ సభ్యులు

మహానంది: నంద్యాల జిల్లా విజిలెన్స్ మానిటరింగ్ కమిటీ సభ్యులు డి.రవికాంత్, గోపవరం కాశన్న శనివారం మహానంది ఈఓ నల్లకాలువ శ్రీనివాస రెడ్డిని కలిసి సన్మానించారు. ఈఓను కలిసిన వారిలో ఆల్ ఇండియా హ్యూమన్ రైట్స్ ఆర్గనైజేషన్ రాష్ట్ర అధ్యక్షుడు పీఎస్ఎస్ రాయుడు, ఎమ్మార్పీఎస్ జిల్లా నేత చెవుల వెంకటసుబ్బయ్య ఉన్నారు.

రోడ్డుప్రమాదంలో ఇద్దరికి గాయాలు

పాములపాడు: కర్నూలు–గుంటూరు ప్రధాన రహదారిపై శనివారం చోటుచేసుకున్న రోడ్డుప్రమాదంలో ఇద్దరు గాయాలపాలయ్యారు. ఎస్ఐ సురేష్ బాబు తెలిపిన వివరాలు.. విజయవాడ నుంచి కర్నూలుకు వెళ్తున్న కారు ఘటనా స్థలంలో ముందు వెళ్తున్న టీవీఎస్ ఎక్సెల్ ద్విచక్రవాహనాన్ని ఢీకొంది. ప్రమాదంలో ద్విచక్రవాహనంపై వెళ్తున్న మౌలాలి, చిన్న వెంకటేశ్వరరావు తీవ్రంగా గాయపడ్డారు. వారిని అంబులెన్స్‌లో ఆత్మకూరు ప్రభుత్వ ఆసుపత్రికి తీసుకెళ్లగా ప్రథమ చికిత్స అనంతరం కర్నూలుకు తరలించారు. ఎస్ఐ ఘటనా స్థలానికి వెళ్లి పరిశీలించారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఆయన తెలిపారు.

మోడల్ స్కూళ్ల ఆలోచన విరమించుకోవాలి


పోస్టర్‌లను విడుదల చేస్తున్న పీఆర్‌టీయూ ఉపాధ్యాయులు

ఆత్మకూరు: క్లస్టర్ పాఠశాలల్లోని కొన్నిటి కలిపి మోడల్ స్కూళ్లగా ఏర్పాటు చేసే ఆలోచనను విరమించుకోవాలని పీఆర్‌టీయూ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు రామపక్కిరెడ్డి, చాంద్‌బాషా, భాస్కర్ రెడ్డి కోరారు. శనివారం ప్రభుత్వ పాఠశాల వద్ద పోస్టర్లు విడుదల చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జిల్లా విద్యాశాఖ అధికారి, సమగ్రశిక్ష ఏపీసీ అధికారులు క్లస్టర్ పరిధిలో పాఠశాలల బాధ్యతలను చూడాల్సి ఉందని, అందుకు బదులుగా మోడల్ స్కూళ్లకు సంబంధించిన ప్రిన్సిపాళ్లకు కొన్ని అధికారాలు ఇచ్చే అవకాశం ఉందన్నారు. ప్రస్తుతం మోడల్ స్కూళ్లలో పనిచేసే ఉపాధ్యాయులకు ఎలాంటి రూల్స్ లేవని, ఇందువల్ల మోడల్ స్కూళ్ల వద్ద మ్యాపింగ్ చేసినా, సర్వీస్ రిజిస్టర్ కావొచ్చు లేదా కాకపోవచ్చు అని, ఇది కొత్త వివాదానికి దారి తీస్తుందని చెప్పారు. భవిష్యత్‌ను దృష్టిలో ఉంచుకుని మోడల్ స్కూళ్లను క్లస్టర్‌గా ఏర్పాటు చేసే విధానం ఆలోచనను మానుకోవాలన్నారు. అనంతరం పోస్టర్లను విడుదల చేశారు. కార్యక్రమంలో పీఆర్‌టీయూ రాష్ట్ర అసోసియేషన్ అధ్యక్షులు విజయరాజు, పాణ్యం మండల అధ్యక్షులు మాధవరెడ్డి పాల్గొన్నారు.

వెదుర్ల పట్టివేత


ఆటోలను సీజ్ చేసిన అటవీ శాఖ అధికారులు

బండిఆత్మకూరు: అటవీ కార్యాలయ పరిధిలోని సంతజూటూరు వద్ద శనివారం తెల్లవారుజామున అక్రమంగా తరలిస్తున్న 200 వెదురు దుంగలు పట్టుకున్నట్లు ఎఫ్ఎస్ఓ నాగరాజు, ఎస్‌బీఓ ప్రసన్న తెలిపారు. వెదురు దుంగలను ఆటోలో అక్రమంగా తరలిస్తున్నట్లు వచ్చిన సమాచారం మేరకు దాడులు నిర్వహించగా రెండు ఆటోల్లో 200 వెదురు దుంగలు తరలిపోతుండగా పట్టుకున్నామన్నారు. వీటి విలువ దాదాపు రూ.20 వేల వరకు ఉంటుందని, పట్టుబడిన దుంగలను బండిఆత్మకూరు రేంజ్ కార్యాలయానికి తరలించి ఆటోలను సీజ్ చేశామని చెప్పారు.

ఇళ్ల స్థలాలు మంజూరు చేయాలి

జూపాడుబంగ్లా: ఇళ్లు, ఇళ్ల స్థలాలు మంజూరు చేయాలని సీపీఐ నాయకుడు రమేష్‌బాబు డిమాండ్ చేశారు. శనివారం ఆయన మాట్లాడుతూ తాము అధికారంలోకి వస్తే గ్రామీణ ప్రాంతాల్లో మూడు సెంట్లు, పట్టణ ప్రాంతాల్లో రెండు సెంట్ల చొప్పున పేదలకు ఇంటి స్థలాలు మంజూరు చేస్తామని కూటమి నాయకులు హామీ ఇచ్చారన్నారు. ఇంటి స్థలాలు, ఇళ్లు మంజూరు చేసి మాట నిలబెట్టుకోవాలన్నారు. కార్యక్రమంలో సీపీఐ నాయకులు పుల్లన్న, మగ్బుల్‌బాషా, వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు.

పంటలు నమోదు చేయించుకోండి

పాములపాడు: రబీ సీజన్‌లో సాగు చేసిన పంటల వివరాలు నమోదు చేయించుకోవాలని మండల వ్యవసాయాధికారి ఫణీశ్వరరెడ్డి అన్నారు. శని వారం ఆయన స్థానిక మండల వ్యవసాయాధికారి కార్యాలయంలో మాట్లాడుతూ పంట నమోదు చేసుకున్న వారికి ప్రకృతి వైపరీత్యాల వల్ల పంట నష్టం జరిగిన పంటను మద్దతు ధరకు అమ్ముకునేందుకు వీలుంటుందన్నారు. దరఖాస్తులు అన్ని గ్రామాల్లో రైతు సేవా కేంద్రాల్లో అందుబాటులో ఉన్నాయన్నారు. ఆధార్‌కార్డు, పట్టాదారు పాసు బుక్కు, బ్యాంకు ఖాతా జిరాక్స్, మొబైల్ నెంబరుతో సంప్రదించాలని వివరించారు.

ఆచూకీ కోసం గాలింపు

ఆత్మకూరు: పట్టణానికి చెందిన నిరంజన్‌వలి సూసైడ్ లెటర్ రాసి కనిపించకుండా పోయాడాని అందిన ఫిర్యాదు మేరకు ఆచూకీ కోసం ముమ్మరంగా గాలిస్తున్నట్లు సీఐ రాము తెలిపారు. శనివారం ఆయన మాట్లాడుతూ యువకుడి తల్లిదండ్రుల ఫిర్యాదు మేరకు ఐదు బృందాలుగా ఏర్పడి గాలిస్తున్నామన్నారు. ఒక టీంను కర్నూలుకు, రెండో టీంను నంద్యాలకు, మూడో టీంను వెంకటాపురం ఫారెస్ట్, బైర్లూటీ, శ్రీశైలం వరకు, నాలుగో టీంను కరివేముల నుంచి పాములపాడు, కె.సి.కెనాల్ వరకు, ఐదో టీంను డ్రోన్ కెమెరాల ద్వారా నల్లమల అటవీ ప్రాంతంతోపాటు సిద్ధాపురం చెరువు, వెలుగోడు రిజర్వాయర్, వైఎస్సార్ స్మృతివనం వరకు పరిశీలిస్తున్నామన్నారు. ఆచూకీ లభించిన వెంటనే వివరాలు వెల్లడిస్తామన్నారు.

మహానంది దేవస్థానానికి నూతన మాస్టర్‌ప్లాన్?

మహానంది: మహానంది దేవస్థానానికి త్వరలో నూతన మాస్టర్‌ప్లాన్ సిద్ధం కానుంది. ఇప్పటికే గత ఏడాది అక్టోబర్ నెలలో హైదరాబాద్‌కు చెందిన ఆర్కిటెక్చర్స్ బృందం మహానంది ఆలయానికి చేరుకుని ఈఓ శ్రీనివాసరెడ్డితో చర్చించారు. భవిష్యత్‌ను దృష్టిలో ఉంచుకుని ఆలయానికి చెందిన 52.40 సెంట్ల విస్తీర్ణంలో రూపొందించిన మాస్టర్‌ప్లాన్‌ను ఈఓకు చూపించి పలు సూచనలు తీసుకున్నారు. ఇటీవల మాస్టర్‌ప్లాన్‌కు అనుగుణంగా టోపోగ్రాఫిక్ సర్వే చేయించారు. గతంలో రూపొందించిన మాస్టర్ ప్లాన్‌లతో పాటు ప్రస్తుతం ఆలయ పరిధిలో జరుగుతున్న అభివృద్ధి పనులు, వసతి గృహాల నిర్మాణాలను దృష్టిలో ఉంచుకుని మార్పులు, చేర్పులు చేశారు. నూతన మాస్టర్‌ప్లాన్‌ను దేవదాయశాఖ కమిషనర్‌గా బాధ్యతలు స్వీకరించిన రామచంద్రమోహన్‌ను ఆలయ అధికారులు రెండు, మూడు రోజుల్లో కలిసి ఆమోదంపై చర్చించనున్నట్లు తెలిసింది.

అంబేడ్కర్‌కు ఘన నివాళి

పాములపాడు: ప్రపంచంలోనే అతి పెద్ద లిఖిత రాజ్యాంగం కలిగినది భారతదేశమని బీజేపీ మండలాధ్యక్షుడు మురళీమోహన్ అన్నారు. శనివారం భారత రాజ్యాంగం దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ చిత్రపటానికి పూల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా మురళీమోహన్ మాట్లాడుతూ రాజ్యాంగం అమల్లోకి వచ్చిన తర్వాత దేశంలోని ప్రతి పౌరుడికి ప్రాథమిక హక్కులు వచ్చాయన్నారు. అందరూ సమానంగా విద్యాబుద్ధులు నేర్చుకోగలుగుతున్నారన్నారు. రాజ్యాంగ ఆకాంక్షలను నిలబెట్టాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు రేణుక, చంద్రశేఖరరెడ్డి పాల్గొన్నారు.


ఉత్సాహంగా కబడ్డీ ఆడుతున్న బాలికలు

హోరాహోరీగా క్రీడాపోటీలు

దొర్నిపాడు: గణతంత్ర దినోత్సవాన్ని పురస్కరించుకుని స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసని క్రీడాపోటీలు శనివారం హోరాహోరీగా సాగాయి. కబడ్డీ, ఖోఖో, టెన్నికాయిట్, వాలీబాల్ తదితర విభాగాల్లో బాలికలకు, బాలురకు వేర్వేరుగా నిర్వహించారు. విజేతలకు ఆదివారం గణతంత్ర దినోత్సవంలో బహుమతులను అందజేయనున్నట్లు ఫిజికల్ డైరెక్టర్ దేవేంద్ర తెలిపారు.

చట్టాలు అందరికీ సమానం


న్యాయవిజ్ఞాన పోస్టర్లను ఆవిష్కరిస్తున్న దృశ్యం


గోస్పాడు: చట్టాలు అందరికీ సమానంగా వర్తిస్తాయని ఆళ్లగడ్డ సీనియర్ న్యాయమూర్తి శైలజ అన్నారు. స్థానిక ఎంపీడీఓ సమావేశ భవనం ముందు శనివారం విధాన్ సే సమాధాన్ కార్యక్రమంలో భాగంగా మహిళలకు న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహించారు. మండల న్యాయసేవా సంఘం ఆళ్లగడ్డ వారి ఆధ్వర్యంలో కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు. అనంతరం కార్యక్రమానికి సంబంధించిన పోస్టర్లను విడుదల చేశారు. ఐసీడీఎస్ ఏపీడీపీఓ పద్మావతిదేవి, సీనియర్ న్యాయవాదులు రమాదేవి, విజయ్, ఈఓఆర్‌డీ నాగఅనసూయ, ఎస్ఐ వెంకటప్రసాద్ పాల్గొన్నారు.

క్రీడలతో స్నేహసంబంధాలు మెరుగు


బహుమతులను అందజేస్తున్న రూరల్ సీఐ సుబ్రమణ్యం

నందికొట్కూరు: క్రీడలతో స్నేహసంబంధాలు మెరుగు పడతాయని రూరల్ సీఐ సుబ్రహ్మణ్యం అన్నారు. పట్టణ సమీపంలోని కేబీఎన్ గ్రానైట్స్, టైల్స్ ఆధ్వర్యంలో సంక్రాంతి పండుగ సందర్భంగా నిర్వహించిన క్రికెట్ పోటీలు శనివారం ముగిశాయి. బ్రాహ్మణకొట్కూరు జట్టు ప్రథమ స్థానంలో నిలిచి రూ.40 వేల నగదు బహుమతిని కైవసం చేసుకుంది. ఇక రెండో బహుమతి రూ.20 వేలు కర్నూలు మండలంపడిదెంపాడు, మూడో బహుమతి రూ.10 వేలు నందికొట్కూరు పోలీసు టీమ్, నాలుగో బహుమతి రూ.5 వేలు 10 బొల్లవరం గ్రామం జట్లు దక్కించుకున్నాయి. కార్యక్రమంలో పోటీల ఆర్గనైజర్లు రాజశేఖర్‌రెడ్డి, షకిల్ రబ్బానీ, మధు, దిలీఫ్, మనోజ్‌కుమార్‌రెడ్డి పాల్గొన్నారు.

ఓబీసీ జిల్లా కన్వీనర్‌గా శ్రీనివాసులు



ఆళ్లగడ్డ: ఓబీసీ జిల్లా కన్వీనర్‌గా డాక్టర్ ఈపనగండ్ల శ్రీనివాసులును నియమించారు. రాష్ట్ర అధ్యక్షుడు వరప్రసాద్ గుంటూరులో జరిగిన రాష్ట్ర సమావేశంలో జిల్లాకు ఓబీసీ కన్వీనర్‌గా తనను నియమించారని శ్రీనివాసులు తెలిపారు. రాజ్యాధికారం దిశగా బహుజనులను ఏకం చేసేందుకు కృషి చేస్తానన్నారు.

ఫిబ్రవరి నుంచి నెల వ్యవధి బస్ పాస్‌లు

నంద్యాల(వ్యవసాయం): నంద్యాల పరిసర ప్రాంత విద్యార్థులు బస్ పాస్‌లను సద్వినియోగం చేసుకోవాలని డిపో మేనేజర్ గంగాధర్ శనివారం తెలిపారు. ఆయన మాట్లాడుతూ 2024–25 విద్యాసంవత్సరానికి గాను కొన్ని కోర్సుల కాలవ్యవధి ముగుస్తున్నందున ఫిబ్ర వరి నుంచి నెల వ్యవధి బస్సు పాస్‌లను ఇస్తామ ని తెలిపారు. వివరాలకు సెల్ : 9885845613 నంబర్‌లో సంప్రదించాలని కోరారు.

రోడ్డు నిబంధనలు పాటించాలి


బైక్ ర్యాలీలో పాల్గొన్న సీఐ ప్రసాద్ రావు, పోలీసులు

శ్రీశైలం: రహదారి నిబంధనలు పాటించాలని ఈఓ శ్రీనివాసరావు సూచించారు. రోడ్డు భద్రతా వారోత్సవాల్లో భాగంగా శనివారం దేవస్థానం హాస్పిటల్ సర్కిల్ వద్ద పోలీసుల బైక్ ర్యాలీని సీఐ ప్రసాద్‌రావుతో కలిసి ఈఓ ప్రారంభించారు. వారు మాట్లాడుతూ టూ వీలర్స్‌లో ప్రయాణించేవారు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలన్నారు. రోడ్డు ప్రమాదాలు జరిగినప్పుడు హెల్మెట్ తలకు రక్షణగా ఉండి ప్రాణాలు కాపాడుతుందన్నారు. రూ.లక్ష విలువ చేసే బైక్ కొనుగోలు చేసి, వెయ్యిచ రూపాయలు పెట్టి హెల్మెట్ కొనుగోలు చేయకపోవడం తగదన్నారు. ప్రతి ద్విచక్రవాహనదారుడు హెల్మెట్ ధరించి తన ప్రాణాలు కాపాడుకుంటూ కుటుంబానికి కూడా రక్షణగా నిలవాలన్నారు. కారులో ప్రయాణిస్తున్న వారు సీట్ బెల్ట్ ధరించాలన్నారు. అతివేగం, పరిమితికి మించి ప్రయాణికులకు ఎక్కించుకోవద్దని వాహనదారులకు సూచించారు.

● **ఆత్మకూరు:** పట్టణంలో వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ వాడాలని పోలీసుశాఖ ఆధ్వర్యంలో శనివారం ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐ రాము మాట్లాడుతూ బైకుపై వెళ్లే వారు హెల్మెట్ లేకుండా ప్రయాణిస్తే జరిమానాలు విధిస్తామన్నారు. అంతకుముందు స్థానిక పోలీస్‌స్టేషన్ నుంచి గౌడ్ సెంటర్, ఆర్టీసీ బస్టాండు, కొత్త, పాత బస్టాండు వరకు ర్యాలీ నిర్వహించారు.

నిందితులను కఠినంగా శిక్షించాలి


ఏపీఓ నాగమ్మకు వినతి పత్రం అందజేస్తున్న ఏపీ గ్రామీణ ఉపాధిహామీ పథకం ఫీల్డ్ అసిస్టెంట్లు


నిరసన వ్యక్తం చేస్తున్న ఉపాధి సిబ్బంది

ఆత్మకూరు: అరికెర ఉపాధిహామీ ఫీల్డ్ అసిస్టెంట్ ఈరన్నను హత్య చేసిన దుండగులను కఠినంగా శిక్షించాలని ఫీల్డ్ అసిస్టెంట్ల సంఘం ఆత్మకూరు నాయకులు శివారెడ్డి, సంపత్ డిమాండ్ చేశారు. శనివారం ఎంపీడీఓ కార్యాలయం వద్ద ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అధికార పార్టీ నాయకులు కొంతకాలంగా ఫీల్డ్ అసిస్టెంట్‌ను ఉద్యోగం నుంచి మానుకోవాలని బెదిరించారన్నారు. అతడు కొంత సమయం ఇవ్వాలని కోరాడని అంతలోనే హత్య చేయడం సరికాదన్నారు. బాధిత కుటుంబ సభ్యుల్లో ఒకరికి ప్రభుత్వ ఉద్యోగం ఇవ్వాలని, రూ.20 లక్షలు ఎక్స్‌గ్రేషియా చెల్లించాలని డిమాండ్ చేశారు. అనంతరం ఏపీఓ నాగమ్మకు వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో ఆత్మకూరు, కొత్తపల్లి మండలాల ఫీల్డ్ అసిస్టెంట్లు సుధాకర్, ఎల్లానాయుడు, బ్రహ్మచారి, స్వాములు, సురేష్, రామకృష్ణనాయక్, చిన్ననాగన్న, శివరాముడు పాల్గొన్నారు.

నల్ల బ్యాడ్జీలతో నిరసన

జూపాడుబంగ్లా: అరికెర గ్రామానికి చెందిన ఫీల్డ్ అసిస్టెంట్ ఈరన్నను దారుణంగా హత్యచేసిన వారిని కఠినంగా శిక్షించాలని ఉపాధిహామీ పథకం సిబ్బంది డిమాండ్ చేశారు. ఫీల్డ్ అసిస్టెంట్‌ను హత్య చేయడాన్ని నిరసిస్తూ శనివారం ఈసీ, టీఏలు, ఫీల్డ్ అసిస్టెంట్లు నల్లబ్యాడ్జీలు ధరించి కార్యాలయం వద్ద నిరసన వ్యక్తం చేశారు. ఏదైనా సమస్య ఉంటే సామరస్యంగా, చట్టబద్ధంగా పరిష్కరించుకోవాలే తప్పా ప్రాణాలు తీయడం, దౌర్జన్యాలకు పాల్పడటం తగదన్నారు. కార్యక్రమంలో ఉపాధిహామీ పథకం ఈసీ, టీఏలు, వివిధ గ్రామాల ఫీల్డ్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

జగనన్న కాలనీకి బస్సు స్టాప్ ఏర్పాటు చేయాలి


బస్సు స్టాప్ ఏర్పాటు చేయాలంటూ వినతి పత్రం అందజేస్తున్న నాయకులు

నందికొట్కూరు: జగనన్న కాలనీకి ఆర్టీసీ బస్సు స్టాప్ ఏర్పాటు చేయాలని సీపీఎం నాయకులు నాగేశ్వరరావు కోరారు. శనివారం పట్టణంలోని ఆర్టీసీ డిపో మేనేజర్ శ్రీనివాసులుకు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ 2,500 గృహాలతో జగనన్న కాలనీ నిర్మించారన్నారు. పట్టణానికి సుమారు 3 కిలో మీటర్ల దూరంలో జగనన్న కాలనీ ఉండటంతో విద్యార్థులకు, రోజువారీ కూలీ పనుల కోసం వెళ్లాలంటే ఆటోలకు రూ.100 చెల్లించాల్సిన పరిస్థితి ఉందన్నారు. ఆర్టీసీ బస్సుకు రూ.10 నుంచి రూ.20 వరకు బస్సు టికెట్ తీసుకుంటున్నారన్నారు. మున్సిపాలిటీ పరిధిలో 5 కిలో మీటర్ల వరకు ఉన్న ఆర్టీసీ బస్సు రూ.10 మాత్రమే తీసుకోవాలని డిమాండ్ చేశారు. మేనేజర్‌ను కలిసిన వారిలో సీపీఎం నాయకులు గోపాలకృష్ణ, ఉస్మాన్‌బాషా, బాబు, నాగన్న, గోకారి, మధు, రామకృష్ణ, సుభాన్, ప్రవీణ్ పాల్గొన్నారు.

27 నుంచి ప్రత్యేక ఆధార్ శిబిరాలు

వెలుగోడు: ఈనెల 27 నుంచి 30వ తేదీ వరకు మండలంలో ప్రత్యేక ఆధార్ శిబిరాలు ఏర్పాటు చేయనున్నట్లు ఎంపీడీఓ మధుసూదన్ రెడ్డి తెలిపారు. శనివారం ఆయన మాట్లాడుతూ ఆరు ఏళ్ల చిన్నారులకు 27న వేల్పనూరు, 28 అబ్దుల్లాపురం, 29న గుంతకందాల, 30న వెలుగోడు గ్రామాల్లో ఆధార్ శిబిరాలు ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. ఆయా గ్రామాల్లోని సచివాలయాల్లో నిర్వహించే శిబిరాలను చిన్నారుల తల్లిదండ్రులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

సెక్యూరిటీ గార్డులను విధుల్లోకి తీసుకోవాలి


డీఎఫ్ఓకు వినతి పత్రం అందజేస్తున్న మాలమహానాడు నాయకులు

ఆత్మకూరు: పట్టణ సమీపంలోని వైఎస్సార్ స్మృతివనంలో తొలగించిన సెక్యూరిటీ గార్డులను వెంటనే విధుల్లోకి తీసుకోవాలని మాలమహానాడు నాయకులు శీలం శేషు, గిరీష డిమాండ్ చేశారు. శనివారం వారు ఆత్మకూరు డీఎఫ్ఓ సాయిబాబాకు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వైఎస్సార్ స్మృతివనంలో 12 ఏళ్లుగా సెక్యూరిటీ గార్డులుగా క్రిష్టఫర్, భాస్కర్, శివుడు, రఘువర్మ విధులు నిర్వహిస్తున్నారన్నారు. రాత్రి విధుల్లో భాగంగా నిద్రించకపోవడంతో సంబంధిత రేంజర్ ఎం.ఎ.ఖాన్ సెక్యూరిటీ గార్డులపై తప్పుడు రిపోర్టును ఉన్నతాధికారులకు ఇచ్చారన్నారు. దీంతో మూడు నెలలుగా వారిని విధుల నుంచి తొలగించారన్నారు. మరోసారి డీఎఫ్ఓ విచారించి తొలగించిన వారిని విధుల్లోకి తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో సంఘం నాయకులు మల్లయ్య, రాఘవేంద్ర, చంద్రశేఖర్, చెన్నయ్య, సురేష్ పాల్గొన్నారు.